క్లుప్తంగా

డ్రగ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సై సురేష్

రాయవరం: డ్రగ్స్ రహిత సమాజానికి యువత కృషి చేయాలని రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎస్ సురేష్ పిలుపునిచ్చారు. రాయవరం విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో గురువారం డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా 'యువతా మేలుకో-భవితను మలచుకో-డ్రగ్స్ వదులుకో' అనే నినాదంతో విద్యార్థులకు సమావేశాన్ని నిర్వహించారు. యువత గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. చదువుపైనే దృష్టి సారించి, ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. సమావేశంలో నన్నయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మల్లిడి అమ్మిరెడ్డి, విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సబ్బెళ్ల అచ్చిరెడ్డి, వీఎస్ఆర్ రూరల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిడి సతీష్‌రెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాంబాబు కుటుంబానికి ఎమ్మెల్సీ తోట పరామర్శ

మండపేట: పట్టణంలోని 16వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు మోటుపల్లి రాంబాబు ఆకస్మిక మృతి నేపథ్యంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి గురువారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామని భరోసానిచ్చారు. రాంబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జంగం కార్పొరేషన్ డైరెక్టర్ మీగడ శ్రీనివాస్, కౌన్సిలర్ మెండు బాపిరాజు, పార్టీ నాయకులు సాధనాల శివ భగవాన్, శెట్టి నాగేశ్వరరావు, పులగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సమావేశం

మండపేట: మండపేట రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశం 11వ తేదీన జరుగనున్నట్టు సంఘ కార్యదర్శి పెంకే గోవిందరావు తెలిపారు. స్థానిక రామహిందు మున్సిపల్ స్కూల్‌లో సంఘ అధ్యక్షుడు దేవళ్ల సత్యనారాయణ అధ్యక్షతన శనివారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సమావేశంలో ఇన్‌కంటాక్స్, ఈకేవైసీ, లైఫ్ సర్టిఫికెట్ తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సభ్యులందరూ హాజరుకావాలని గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో కోరారు.

ఆక్రమణ తొలగింపు



ఆక్రమణను తొలగిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ పూసలవారి కాలనీలోని పంచాయతీ స్థలం ఆక్రమణను సర్పంచ్ కొత్తపల్లి అరుణ, కార్యదర్శి వలివేటి సూర్యసుబ్రహ్మణ్యం, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శివ గురువారం తొలగింపజేశారు. పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకే ట్రాఫిక్ నిబంధనలు



నాకాబందీ నిర్వహిస్తున్న ఏఎస్సై డేవిడ్, పోలీసు సిబ్బంది

కాజులూరు: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గొల్లపాలెం ఏఎస్సై డేవిడ్ అన్నారు. గ్రామంలోని కాకినాడ – కోటిపల్లి రహదారిపై ఏఎస్సై డేవిడ్, స్టేషన్ సిబ్బంది గురువారం నాకాబంది నిర్వహించారు. రికార్డులు సక్రమంగా లేని లారీలు, ట్యాక్సీలు, కార్లు, మోటార్ సైకిళ్లు, ఇతర వాహనదారులకు జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రయాణికులకు ఏఎస్సై పలు సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది అంబేడ్కర్, సత్య, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవాలు

కాజులూరు: గొల్లపాలెం పాపాయమ్మపేటలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద స్వామి వారి కల్యాణ మహోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. స్థానిక విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఉదయం నుంచీ శ్రీమాతా గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారికి కల్యాణం, ప్రత్యేక పూజాది కార్యక్రమాలు, హోమం నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల మంది భక్తులు కల్యాణ మహోత్సవాల్లో పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

కళాశాల వచ్చిందోయ్..

- గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఏర్పాటు
- నేడు తరగతులు ప్రారంభించనున్న ఎమ్మెల్సీ తోట
- త్వరలో మాచవరంలో బాలికల జూనియర్ కాలేజీ ఏర్పాటు



జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తున్న శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల

రాయవరం: పంట పొలాల మధ్య, అసౌకర్యాల నడుమ కొనసాగుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అదృష్టం వరించింది. అన్ని సదుపాయాలు కల్పిస్తూ ఈ కళాశాలను గ్రామంలోని ఉన్నత పాఠశాలకు మార్చనున్నారు. శుక్రవారం మార్చేందుకు అన్ని ఏర్పాటు పూర్తయ్యాయి.

1984లో స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో కళాశాలను ఏర్పాటు చేశారు. ఇది పేద విద్యార్థులకు వరంగా మారింది. కళాశాల ఏర్పాటుతో ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు ఆస్కారం ఏర్పడింది. అయితే ఉన్నత పాఠశాలలో షిఫ్టు పద్ధతిలో నడిచే కళాశాలను 2001లో గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఆ కళాశాలకు కష్టాలు ప్రారంభమయ్యాయి. దూరాభారం, రవాణా సౌకర్యం లేకపోవడం, పంట పొలాల మధ్య ఉండడం, విషసర్పాలు వస్తుండడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యేవారు. దీంతో కళాశాలలో చేరికలు క్రమంగా తగ్గుతూ వచ్చాయి. కళాశాల తొలినాళ్లలో సుమారు 600 మంది వరకు విద్యాభ్యాసం చేయగా, నేడు ఆ సంఖ్య ఫస్టియర్, సెకండియర్ కలిపి 84కు చేరింది. కళాశాల గ్రామానికి దూరంగా ఉండడంతో ముఖ్యంగా బాలికలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. దీంతో కళాశాల ఉనికికే ప్రమాదం ఏర్పడిన పరిస్థితులు వచ్చాయి. జూనియర్ కళాశాలను గ్రామంలోని ఉన్నత పాఠశాలలోకి మార్చేందుకు ఏర్పాట్లు చేశారు.

రెండు నియోజకవర్గాల విద్యార్థులకు..

మండపేట, అనపర్తి నియోజకవర్గాల పరిధిలోని విద్యార్థులకు రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రయోజనంగా ఉంటుంది. మండలంలోని రాయవరం, సోమేశ్వరం, లొల్ల, మాచవరం, అనపర్తి మండలం రామవరం, కొప్పవరం, మహేంద్రవాడ, బిక్కవోలు మండలం కొమరిపాలెం, తొస్సిపూడి, కొంకుదురు, పందలపాక నుంచి విద్యార్థులకు కళాశాలకు వచ్చేవారు. ఈ కళాశాల 11 గ్రామాల విద్యార్థులకు అందిపుచ్చుకున్నట్టుగా ఉంటుంది. ముఖ్యంగా వేల రూపాయలు ఖర్చు చేసి, చదివించుకోలేని పేద, మధ్య తరగతి విద్యార్థుల ఉన్నత చదువులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. రాజానగరం–సోమేశ్వరం ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఉన్నత పాఠశాల ఉండడంతో విద్యార్థులు సులువుగా కళాశాలను చేరుకోవడానికి అనువుగా ఉంటుంది.



జూనియర్ కళాశాల విద్యార్థులు

బాలికల జూనియర్ కళాశాల తరలించే యోచన

ప్రభుత్వం నూతన విద్యా విధానంలో భాగంగా రాయవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాలికల జూనియర్ కళాశాలను మంజూరు చేసింది. ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయడంతో ఒకే ప్రాంగణంలో రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నట్టవుతుంది. దీంతో బాలికల జూనియర్ కళాశాలను మాచవరం ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేస్తే మాచవరం పరిసర గ్రామాల విద్యార్థులకు ప్రయోజనకరంగా ఉంటుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఉన్నతాధికారులకు సూచించారు. అధికారులు చర్యలు చేపడితే త్వరలోనే బాలికల జూనియర్ కళాశాలను మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రారంభించే అవకాశముంటుంది.

నేడు తరగతులు ప్రారంభం

స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇకపై ఉన్నత పాఠశాలలో కళాశాల తరగతులు రెగ్యులర్‌గా జరగనున్నాయి. కళాశాల తరగతుల ప్రారంభానికి ఇంటర్ బోర్డు ఆర్‌జేడీ ఐ.శారద, ఆర్ఐవో ఎం.నరసింహం, డీవీఈవో ఎస్‌వీవీ సత్యనారాయణరెడ్డి రానున్నట్టు సమాచారం.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జూనియర్ కళాశాలను ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటుకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయి. ఆ ప్రకారం శుక్రవారం ఉన్నత పాఠశాలలో తరగతులను ప్రారంభిస్తున్నాం. ఉన్నత పాఠశాలలో కళాశాల ఏర్పాటు చేయడం వల్ల అధ్యాపకులకు, విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

– దారపు వీరవెంకట నాగేశ్వరరెడ్డి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాయవరం

సమన్వయంతో పనిచేస్తాం



ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉన్నత పాఠశాలలోకి తీసుకుని వచ్చేందుకు గ్రామ పెద్దలు చేసిన కృషి ఫలించింది. జిల్లా పరిషత్ నుంచి కూడా అనుమతి లభించింది. ప్రిన్సిపాల్‌ను సమన్వయం చేసుకుని కళాశాల అభివృద్ధికి కృషి చేస్తాం.

– పప్పు శ్రీనివాసరెడ్డి, జీహెచ్ఎం, జెడ్పీహెచ్ఎస్, రాయవరం

తొలగిన ఇబ్బందులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో పూర్వ విద్యార్థులు కళాశాల మార్పు కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఆ వినతిని అధికారంలోకి వచ్చాక సానుకూల దృక్పథంతో పరిష్కరించారు. మా ఇబ్బందులు తొలగినట్టయింది.

– వి.పూజశ్రీవల్లి, సెకండియర్ విద్యార్థిని, రాయవరం

ఎంతో సంతోషం



దూరాభారంతో ఇబ్బందులు పడుతున్న మాకు కళాశాలను స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోకి మార్చడం సంతోషంగా ఉంది. కళాశాలకు వెళ్లేందుకు చాలా సమస్యలు ఎదుర్కొనేవాళ్లం. మా సమస్యను పరిష్కరించిన గ్రామ పెద్దలకు, ప్రజాప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు.

– ఎం.నాగదుర్గ, సెకండియర్ విద్యార్థిని, రాయవరం

విధుల్లో అంకిత భావంతో పని చేయాలి



నియామక పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందుతాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సూచించారు. కపిలేశ్వరపురం, రాయవరం ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో కొత్తగా అంగన్‌వాడీ కేంద్రాల ఆయాలుగా నియమితులైన తొమ్మిది మందికి స్థానిక క్యాంపు కార్యాలయంలో గురువారం ఎమ్మెల్సీ తోట నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అవినీతికి తావులేకుండా పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాల లబ్ధి పూర్తిస్థాయిలో అంగనవాడీ కేంద్రం పరిధిలోని వారందరికీ అందేలా చూడాలని సూచించారు. సీడీపీఓ గజలక్ష్మి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆధార్ అప్‌డేట్



అంగరలో విద్యార్థి ఆధార్ వివరాలను అప్‌డేట్ చేస్తున్న మల్లేశ్వరరావు

కపిలేశ్వరపురం: ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విద్యార్థుల ఆధార్ అప్‌డేట్ ప్రక్రియను అంగరలో చేపట్టారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో స్థానిక శ్రీసిద్ధార్థ జూనియర్, డిగ్రీ కళాశాలలో గురువారం 48 మంది విద్యార్థుల ఆధార్‌లను ఆధునీకరించారు. కపిలేశ్వరపురం-01 సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు ఆధ్వర్యంలోని వలంటీర్ అంగాని రవితేజలు విద్యార్థుల ఫొటో, వేలిముద్రలు, అడ్రస్ తదితర అంశాలను ఆధునీకరించారు. కళాశాలలో శుక్రవారం కూడా కేంద్రాన్ని కొనసాగించనున్నట్టు మల్లేశ్వరరావు తెలిపారు.

పేదరికం నిర్మూలనే లక్ష్యంగా పాలన



ఏడిదలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ఏడిదలో గడప గడపకూ మన ప్రభుత్వం

మండపేట: రాజకీయాలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను చేరవేయడం ద్వారా పేదరికం నిర్మూలనే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని తదితరులతో కలిసి గురువారం గ్రామంలోని బాబూ జగ్జీవన్ రామ్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మూడేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా చేకూరిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. స్థానికులను సమస్యలడిగి తెలుసుకుని అక్కడికక్కడే వాటి పరిష్కారానికి ఎంపీడీఓ ఐ.రాజు, గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజుకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ గతంలో పింఛన్లు, రేషన్‌కార్డులు తదితర వాటి కోసం కార్యాలయాలు, జన్మభూమి కమిటీ నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చాక అన్ని పథకాలు తమ ఇంటి వద్దకే వస్తున్నాయని, ఎక్కడికక్కడ స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, ఉప సర్పంచ్ చంద్ర శ్రీనివాస్, పార్టీ నాయకులు సిరిపురపు శ్రీనివాస్, వల్లూరి రామకృష్ణ, పలివెల సుధాకర్, తాతపూడి రాజేష్, ఎంపీటీసీ సభ్యులు, వార్డు సభ్యులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శివారు భూములకు నీరందించాలి

కాజులూరు: శివారు భూములకు సాగునీరందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రైతు సంఘం నాయకుడు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ పెంకే సత్యనారాయణ, రైతులు డిమాండ్ చేశారు. కాజులూరులో గురువారం వారు విలేకర్లతో మాట్లాడారు. చేదువాడ మీదుగా కాజులూరు వచ్చే ఒకటో నంబరు కాలువ, అంద్రంగి, దుగ్గుదుర్రు మీదుగా వచ్చే కాలువలపై శివారు భూములకు చుక్క నీరు రావటం లేదన్నారు. డ్రెయిన్లకు క్రాస్ బండ్‌లు ఏర్పాటు చేయాలని, తద్వారా ఆ నీటిని ఇంజిన్లతో తోడుకునేందుకు రైతులకు అవకాశం ఉంటుందని, అధికారులు ఇటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరారు.

పరిశోధనలపై అధ్యాపకులకు శిక్షణ

రామచంద్రపురం: నూతన సాంకేతిక పద్ధతులతో పరిశోధనలు చేయడం వలన అనేక ప్రయోజనాలున్నాయని జేఎన్‌టీయూకే డిజిటల్ మానిటరింగ్ ప్రత్యేకాధికారి, కంప్యూటర్స్ అధ్యాపకులు డాక్టర్ ఏఎస్ఎన్ చక్రవర్తి అన్నారు. వీఎస్ఎం అటానమస్ కళాశాలలో నిర్వహించిన పరిశోధనలు, సెమినార్ పేపర్ల నిర్వహణపై గురువారం జరిగిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. పేపర్ల ముద్రణ ఎంపికకు సంబంధించి పరిశోధకులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత తరుణంలో పీహెచ్‌డీ చేయాలంటే పరిశోధనలపై అవగాహన అవసరమని చెప్పారు. ముందస్తుగా జర్నల్‌లో ముద్రించే అంశాల ఎంపికపై అవగాహన కల్పించారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎన్ మూర్తి, ప్రిన్సిపాల్ అన్సారీ తదితరులు చక్రవర్తిని సత్కరించారు.

నేత్రదానం



హనుమంతురావు

కె.గంగవరం: గ్రామానికి చెందిన గంగాపాత్రులు హనుమంతురావు (62) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు సత్యనారాయణ, కాశీ అన్నపూర్ణ, సత్యవేణి దానం చేశారు. వారి ఇంటికి కాకినాడ నుంచి ఐ బ్యాంక్ సిబ్బంది హనుమంతురావు నేత్రాలను సేకరించారు. ఆయన కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. అందరికీ సుపరిచితుడైన హనుమంతురావు మృతికి సంతాపంగా కె.గంగవరంలో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా షాపులు మూసివేశారు.

జవాబుదారీతనంతోనే నైతిక విలువలు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న జమాతే నాయకులు

మండపేట: జవాబుదారీ తనం పెరిగినప్పుడే నైతిక విలువలు పెంపొందుతాయని జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షుడు మొహమ్మద్ రఫీక్ అన్నారు. శనివారం నుంచి 20వ తేదీ వరకు జమాతే తలపెట్టిన జాగరణ ఉద్యమ కరపత్రాన్ని గురువారం స్థానిక సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి సాంకేతికంగా ఎంతో అభివృద్ధి సాధిస్తున్నప్పటికీ మానవతా విలువలు నానాటికి దిగజారుతున్నాయన్నారు. సమాజంలో పెరుగుతున్న నేరాలు, మారణహోమాలు ఇందుకు నిదర్శనమన్నారు. మానవతా విలువలు పెంపొందించేందుకే జాగరణ ఉద్యమం చేపట్టామని రఫీక్ తెలిపారు. అందులో భాగంగా సామజిక, రాజకీయ, తదితర రంగాల్లో ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, వివిధ మతాల ఆధ్యాత్మిక గురువులతో చర్చాగోష్టులు, కరపత్రాలు, పోస్టర్ల పంపిణీ, సోషల్ మీడియా ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. జమాతే నాయకులు రిజ్వాన్, అబులాల తదితరులు పాల్గొన్నారు.

కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు

- నెరవేరిన గడప గడపకూ మన ప్రభుత్వం హామీ



ద్రాక్షారామలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రామచంద్రపురం రూరల్: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఇచ్చిన హామీ నెరవేరింది. ద్రాక్షారామలో శిథిలమైన, ఎత్తు తక్కువగా ఉన్న విద్యుత్ స్తంభాల స్థానంలోను, ఇంకా అవసరమైన చోట్ల కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు సర్పంచ్ కొత్తపల్లి అరుణ తెలిపారు. నున్న వారి వీధి, పూసల వారి కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, పంచాయతీ సిబ్బంది, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

16న మున్సిపల్ మార్కెట్ ఆశీలు వేలం

మండపేట: స్థానిక మున్సిపల్ మార్కెట్, రోడ్డు మార్జిన్లలో ఆశీలు వసూలుకు సంబంధించి ఈ నెల 16న మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు మున్సిపల్ రెవెన్యూ వర్గాలు తెలిపాయి. మేకల కబేళా వద్ద ఫీజు వసూలు, బస్టాండు, పాత పార్కు వద్ద టాయిలెట్ల మెయింటెనెన్స్ ఫీజు వసూలుకు వేలం పాటలు నిర్వహిస్తున్నామన్నారు. ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకూ కాలపరిమితిపై ఈ వేలం జరుగుతుందన్నారు. ధరవత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

వైరల్ జ్వరం.. వద్దిక భయం

- మారుతున్న వాతావరణం
- పెరుగుతున్న జ్వరం కేసులు
- చిన్నారులే అధికం
- ముందు జాగ్రత్తలే మేలంటున్న వైద్యులు



రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి ఓపీ వద్ద జనం క్యూ

రామచంద్రపురం: పగలు ఎండ.. రాత్రి మంచు.. మారుతున్న ప్రస్తుత వాతావరణంతో వారం రోజులుగా ప్రజలు వైరల్ జ్వరాల బారిన పడుతున్నారు. శీతాకాలం నుంచి వేసవిలోకి అడుగు పెడుతున్న వేళ ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. రథ సప్తమి నుంచి ఎండలు పెరుగుతాయని అంటారు. అదే విధంగా వారం రోజులుగా పగటి పూట వేడి పెరిగింది. అదే సమయంలో రాత్రి వేళ చలి తీవ్రత తగ్గుతున్నప్పటికీ విపరీతంగా మంచు పడుతోంది. పలు ప్రాంతాల్లో తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ మంచు కురుస్తూనే ఉంటోంది. దీంతో మార్నింగ్ వాకింగ్‌కు వెళ్లే వారు జ్వరాల బారిన పడుతున్నారు.

రోజూ పదుల సంఖ్యలో..

రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి ఓపీలో ప్రతి రోజూ 50 నుంచి 60 కేసుల వరకూ వైరల్ జ్వరాల బారిన పడుతున్న వారివే ఉంటున్నాయి. మండపేట ఏరియా ఆసుపత్రిలో రోజుకు 30 నుంచి 40 కేసుల వరకూ నమోదవుతున్నాయి. వీరిలో చిన్నారులు అధికంగా ఉంటున్నారు. దగ్గు, జలుబు, తీవ్రమైన ఒళ్లు నొప్పులతో బాధ పడుతున్నారు. రెండు ఏరియా ఆసుపత్రుల్లోనూ ప్రతి రోజూ దాదాపు 50 మంది చిన్నారులు వైరల్ జ్వరాలతో వస్తున్నారు. వీటితో పాటు రామచంద్రపురం నియోజకవర్గంలోని 9, మండపేట నియోజకవర్గంలోని 7 పీహెచ్‌సీల్లో అధిక శాతం కేసులు జ్వరాల బారిన పడిన వారివే ఉంటున్నాయి. రామచంద్రపురం, మండపేట పట్టణాల్లో 25కు పైగా ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. వీటికి కూడా జ్వర బాధితులే ఎక్కువగా వెళ్తున్నారు. జ్వరం సోకగానే మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటివేమోనన్న భయంతో రక్త పరీక్షలు చేయించుకుంటూ ఆసుపత్రుల దారి పడుతున్నారు. రామచంద్రపురం, మండపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రుల్లో జ్వర బాధితులు రెండు రోజులు ఇన్‌పేషెంట్లుగా ఉండి డిశ్చార్జి అవుతున్నారు. కానీ ప్రైవేటు ఆసుపత్రుల్లో మాత్రం వివిధ పరీక్షలతో దోచుకుంటూ రోజుల తరబడి ఇన్‌పేషెంట్లుగా ఉంచుతున్నారు.

ముందు జాగ్రత్తలు తీసుకోవాలి



ఇప్పుడు వస్తున్నవి వైరల్ జ్వరాలు మాత్రమే. వీటి గురించి ఏమాత్రం భయం అవసరం లేదు. ఇప్పటి వరకూ వచ్చిన కేసులలో డెంగీ, మలేరియా వంటివి లేవు. కొద్ది మందికి మాత్రం టైఫాయిడ్ ఉంటోంది. మందులు సక్రమంగా వేసుకుంటే రెండు మూడు రోజుల్లోనే కోలుకుంటున్నారు. జ్వరాల బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం పూట మంచులో ప్రయాణించేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఆహార పదార్థాలను వేడిగా తీసుకోవాలి. చలికాలం కాబట్టి ఏసీలు వాడకపోవటం మంచిది.

– డాక్టర్ వీరభద్రుడు, సూపరింటెండెంట్, ఏరియా ఆసుపత్రి, రామచంద్రపురం

ఆసుపత్రికి వెళ్లి వచ్చేసరికి.. ఉన్నది ఊడ్చేశారు..



బాధితుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఎస్సై సురేష్

రాయవరం: ఆసుపత్రికి వెళ్లే వచ్చే సరికి ఇంట్లో ఉన్న విలువైన వస్తువులను చోరీ చేసిన ఘటన రాయవరం మండలం సోమేశ్వరం శివారు సీతంపేటలో చోటు చేసుకుంది. దీనిపై రాయవరం ఎస్సై పీవీవీఎస్ఎన్ సురేష్ గురువారం కేసు నమోదు చేశారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కట్ట ఈశ్వరరావు, శ్రీవాణి దంపతులు సీతంపేటలో నివాసం ఉంటున్నారు. వీరు ఈ నెల 6న రాజమహేంద్రవరంలో ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో రాజమహేంద్రవరంలోని స్వగృహంలో రాత్రి ఉండిపోయారు. గురువారం ఇంటికి వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నట్టు, బీరువా తెరిచి ఉన్నట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంటిలో ఉన్న రూ.50 వేల నగదు, హెచ్‌పీ ల్యాప్‌టాప్, 24 గ్రాముల బంగారు ఐదు జతల చెవిదిద్దులు చోరీకి గురైనట్టుగా గుర్తించారు. చోరీ విలువ రూ.1.60లక్షలు ఉంటుందని, చోరీ ఘటనపై కట్టా శ్రీవాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.